క్లుప్తంగా

సన్మానం



సన్మానం పొందిన ఉపాధ్యాయులతో అసోసియేషన్ బాధ్యులు

ఖమ్మం సహకారనగర్: తెలంగాణ సిద్ధాంత కర్త, తెలంగాణ జాతిపిత ప్రొఫెసర్ జయశంకర్ జయంతిని పురస్కరించుకుని హైదరాబాద్ లోని వేదస్ విశ్వకర్మ ఎంప్లాయీస్ డెవలప్‌మెంట్ అండ్ సర్వీస్ అసోసియేషన్(వేదస్) ఆధ్వర్యాన ఆదివారం రాష్ట్ర ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి 65 మంది ఉపాధ్యాయులను, ఇటీవల రిటైర్డ్ అయిన ఉపాధ్యాయులు, ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. ఇందులో జిల్లా నుంచి రామోజు అరుణాదేవి, మోదేపల్లి రజిని, బొడ్డుపల్లి శ్రీనివాసరావు, జయంతి శ్రీనివాస గంటల సాంబశివరావు, అనుముల సోమయ్య, చెన్నోజు పుల్లయ్య ఉన్నారు.

గరిడేపల్లిలో తాగునీటి సమస్య

కామేపల్లి: మండలంలోని గరిడేపల్లి గ్రామంలో గత కొద్ది రోజులుగా తాగునీటి సమస్య ఏర్పడడంతో గ్రామస్తులు గ్రామపంచాయతీ కార్యదర్శికి పలుమార్లు విన్నవించారు. అయినా పరిష్కరించలేదని, అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

నేడు పెన్షనర్ల నిరసన

ఖమ్మం సహకారనగర్: నేడు(సోమవారం) జిల్లా కలెక్టరేట్ వద్ద జరిగే పెన్షన్ విద్రోహ నిరసన కార్యక్రమంలో పాల్గొనాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం(ఎస్‌జీపీఏటీ) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పరిశ పుల్లయ్య, రాయల రవికుమార్‌లు ఒక ప్రకటనలో పెన్షనర్లకు పిలుపునిచ్చారు. టీజీఈజేఏసీ పిలుపు మేరకు నిరసన కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు.

రేషన్ డీలర్ల బంద్ విరమణ

ఖమ్మం సహకారనగర్: రేషన్ డీలర్లు తమకు రావాల్సిన కమీషన్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 1 నుంచి నిర్వహించనున్న డీలర్ల బంద్‌ను విరమిస్తున్నట్లు రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బానోత్ వెంకన్న, షేక్.జానిమియాలు తెలిపారు. గత ఐదు నెలలుగా తమకు రావాల్సిన కమీషన్ బకాయిలను విడుదల చేయాలని, లేకుంటే దుకాణాలను బంద్ చేస్తామని, రోజు వారిగా నిరసన కార్యక్రమాలు చేపట్టేందుకు షెడ్యూల్ విడుదల చేసిన క్రమంలో ప్రభుత్వం కమీషన్ విడుదల చేయడంతో బంద్ విరమిస్తున్నట్లు తెలిపారు.

లచ్చిరాంతండా మాజీ సర్పంచ్ మృతి

రఘునాథపాలెం: మండలంలోని లచ్చిరాంతండా మాజీ సర్పంచ్ మాలోతు బాబిచంద్ (58) ఆదివారం అనారోగ్యంతో మృతిచెందారు. ఈమేరకు మాజీ సర్పంచుల సంఘం అధ్యక్షుడు మాదంశెట్టి హరిప్రసాద్, మాజీ సర్పంచ్ మెంటం రామారావు, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ వ్యక్తిగత కార్యదర్శి సీహెచ్.రవికిరణ్, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు జానా, చిన్న నరిసింహారావు, తాత వెంకటేశ్వర్లు, రాంబాబు, రాజేష్, బాల, చిన్నా, శ్రీను, బద్దు, బాబురావు, కృష్ణ తదితరులు సందర్శించి నివాళులర్పించారు. బాబిచంద్ పాడే మోసి తన అభిమానాన్ని చాటుకున్నారు.

వాగు వణుకు..



ఖానాపురం అలుగువాగులో పేరుకుపోయిన చెత్తాచెదారం

నత్తనడకన అండర్ గ్రౌండ్ డ్రెయిన్ నిర్మాణం

- 20 డివిజన్లను అనుసంధానం చేస్తూ సాగుతున్న పనులు
- ఇప్పటికి 15శాతం వరకే పూర్తి
- ఏడాది క్రితమే ముంపునకు గురైన ఖానాపురం అలుగువాగు ప్రాంతాలు
- ఈసారైనా గట్టెక్కించేనా?

ఖమ్మంఅర్బన్: గతేడాది వర్షాలతో జలదిగ్బంధంలో కూరుకుపోయిన ఖానాపురం అలుగువాగు పరిసర ప్రాంతాలు ఈసారైనా భద్రమేనా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. నగరంలో చేపట్టిన అండర్‌గ్రౌండ్ నిర్మాణ పనులు నత్తనడక సాగుతుండడంతో వర్షాలు కురిసినప్పుడల్లా భయాందోళనలకు గురికావాల్సి వస్తుందని ఆ ప్రాంతవాసులు వాపోతున్నారు. గతేడాది సెప్టెంబర్ 1న నగరంలోని చైతన్యనగర్, ప్రశాంత్‌నగర్, కవిరాజునగర్, వరదయ్యనగర్, మైసమ్మగుడి ప్రాంతాలు సహా పలు కాలనీలు వరదలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న సంగతి విదితమే. గతంలో అలుగు వాగు శుభ్రపరిచే పనులు కొన్ని రోజులు జరిగిన తర్వాత నిర్లక్ష్యం చేయడంతో ముంపునకు గురికావాల్సి వచ్చిందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

20 డివిజన్లకు అనుసంధానం..

నగరంలో మొత్తం 20 డివిజన్ల పరిధిలోని మురుగు నీరు తరలించేలా ఈ అండర్ డ్రెయిన్ పైపులైన్ నిర్మాణం సాగుతోంది. అయితే ఖమ్మం-ఇల్లెందు ప్రధాన రోడ్డులో వేసే పైపులైన్ పనులు అనేక నెలలుగా సాగుతుండడంతో రవాణా పరంగా ఇబ్బందులు తలెత్తుతున్నాయి. పైపులైన్ పనులు ఇలా ఉంటే మురుగు నీరు శుద్ధి చేసే యూనిట్ల స్థాపనకు పుట్టకోట చెరువు, ధంసలాపురం చెరువుల వద్ద గుర్తించారు. పుట్టకోట చెరువు వద్ద 2.5 ఎకరాల భూమిని కేటాయించగా.. ధంసలాపురం వద్ద 7 ఎకరాలకు పైగా అవసరం ఉందని దాన్ని కూడా కేటాయించి తమకు అప్పగిస్తే యూనిట్ల నిర్మాణ పనులు ప్రారంభిస్తామని సంబంధిత ఇంజనీర్లు చెబుతున్నారు.

చర్యలు చేపట్టాం..

వర్షం పడితే వాగులో జరుగుతున్న పనులు వారం, పది రోజుల పాటు ఆగాల్సి వస్తోంది. దీంతో తవ్వకాలు చేసిన ప్రాంతాల్లో రవాణాకు అంతరాయం ఏర్పడుతుంది. అయినప్పటికీ పనులను వేగవంతం చేసేందుకు చర్యలు చేపట్టాం. గతేడాది తరహాలో ఎంత వరద వచ్చినా నష్టం జరగకుండా అలుగువాగులో నీరు సాఫీగా పోయేలా తగిన ప్రణాళికలు రూపొందించాం.

– రంజిత్, మున్సిపల్ శాఖ ఎస్‌ఈ

పనుల్లో తీవ్ర జాప్యం..

గతేడాది జరిగిన అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఈఏడాది అమృత పథకం కింద రూ.249 కోట్ల అంచనాతో 9 కిలోమీటర్ల అండర్ గ్రౌండ్ పైపులైన్ నిర్మాణం, మురికినీటి శుద్ధి యూనిట్ల ఏర్పాటు పనులను మొదలు పెట్టారు. అయితే పైపులైన్ నిర్మాణానికి కేటాయించిన రూ.89 కోట్లలో ఇప్పటి వరకు 3.5 కిలోమీటర్ల వరకు మాత్రమే అంటే సుమారు 15శాతం పనులు వరకే పూర్తయ్యాయి. ఈ పనులను వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకోవడంతో ప్రస్తుతం పనులు నత్తనడకన సాగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. మురుగు నీరు తరలించేందుకు వేసే ప్రధాన పైపులైన్, చాంబర్ నిర్మాణాలకు ఆయా ప్రాంతాల్లోని రహదారుల తవ్వకాలు, వాగు అంచుల్లో తవ్వకాలతో మట్టి పేరుకుపోతోంది. పనుల జాప్యం కారణంగా వర్షం కురిసినప్పుడల్లా మురికి నీరు, వర్షపు నీరు నిల్వలతో సమస్యలు మరింత పెరుగుతున్నాయి.



గతేడాది వచ్చిన వరదలో జలమయమైన కవిరాజ్‌నగర్, చైతన్యనగర్ పరిసరాలు(ఫైల్)

జలప్రళయానికి ఏడాది..



వరద ధాటికి తెగిపోయిన సాగర్ ఎడమ కాలువ(ఫైల్)

కూసుమంచి: గతేడాది సెప్టెంబర్ 1న భారీ వర్షాలతో మండలంలో జల ప్రళయం సృష్టించగా.. నాటి ఘటన నేటి వరకు వణుకు పుట్టించింది. ఈ ప్రళయంలో భార్యభర్తలు వరదలో కొట్టుకుపోయి మృతిచెందగా.. కాల్వలు, చెరువులు, రహదారులు తెగిపోయి, పంటలు కొట్టుకుపోయి, నేలలు కోతకు గురైన సంగతి తెలిసిందే. నాడు నష్టపోయిన రైతులు నేటి వరకు కోలుకోలేని పరిస్థితి నెలకొంది. ఇక పాలేరు రిజర్వాయర్ గతంలో ఎన్నడూ లేనివిధంగా 2 లక్షల క్యూసెక్కుల వరదతో ఉగ్రరూపం దాల్చగా.. ఈ ధాటికి లోతట్టు ప్రాంతాల ప్రజలకు కంటిమీద కునుకులేకుండా పోయింది. కాగా, ప్రస్తుతం భారీ వర్షాలు కురుస్తుండగా నాటి ప్రళయం పునరావృతం అవుతుందేమోనని జనం బెంబేలెత్తుతున్నారు. ఇప్పటి వరకు వరుణుడు మరింత ఉగ్రరూపం దాల్చకపోవడంతో ఊపిరి పీల్చుకుంటున్నారు.

కోతకు గురైన రహదారి

మండలంలోని గట్టుసింగారం నుంచి లింగారం తండా వరకు ఇటీవల నూతనంగా బీటీ రహదారి నిర్మించారు. అయితే ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు లింగారంతండా వద్ద రహదారితో పాటు కల్వర్టు కోతకు గురైంది. అంతేకాక వరద ప్రవాహానికి కొంతమేర వరి పంట కొట్టుకుపోయింది. కోతకు గురైన రహదారి, కల్వర్టుకు మరమ్మతులు నిర్వహించాలని పలువురు కోరుతున్నారు.



వరద ధాటికి దెబ్బతిన్న కల్వర్టు

నిమజ్జనాలు.. అన్నదానాలు..

వినాయక చవితి పండుగ నుంచి పూజలందుకుంటున్న గణపతి విగ్రహాల నిమజ్జన కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణనాథుడి విగ్రహాలను పురవీధుల్లో డీజేలు, డప్పు వాయిద్యాల నడుమ ఊరేగిస్తూ యువతీ, యువకులు, చిన్నారులు హోరెత్తించారు. అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం చెరువులు, వాగుల్లో నిమజ్జనం చేశారు. – సాక్షి నెట్‌వర్క్



ఖమ్మం రాపర్తినగర్‌లో అన్నదానాన్ని ప్రారంభిస్తున్న మేయర్ నీరజ, కార్పొరేటర్ రాపర్తి శరత్



25వ డివిజన్‌లో రుద్రహోమంలో పాల్గొన్న కార్పొరేటర్ గోళ్ల చంద్రకళ-వెంకటేశ్వర్లు దంపతులు



ఖమ్మంఅర్బన్ కవిరాజ్‌నగర్‌లో గణేష ఉత్సవ కమిటీ ఆధ్వర్యాన అన్నదానం



ఖమ్మం జయనగర్ కాలనీలో సరస్వతి పూజలు



తిరుమలాయపాలెంలో అన్నదానం



నేలకొండపల్లిలో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న రాయల నాగేశ్వరరావు



కామేపల్లి: తాళ్లగూడెంలో నిమజ్జన వేడుకల్లో పాల్గొన్న గ్రామస్తులు



కూసుమంచి: గట్టుసింగారంలో అన్నదానం

భూకబ్జాదారుల నుంచి స్థలాన్ని కాపాడాలి

ఖమ్మంగాంధీచౌక్: నగరంలో సమాధుల స్థల సాధన మహార్యాలీ పేరిట ఆదివారం జిల్లా సీఎస్ఐ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యాన క్రైస్తవులు శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈర్యాలీ చర్చి కాంపౌండ్ సెయింట్ మేరీస్ సీఎస్ఐ చర్చి నుంచి బోనకల్ క్రాస్‌రోడ్ మీదుగా జెడ్పీసెంటర్ వరకు సాగింది. ఈ సందర్భంగా జిల్లా సీఎస్ఐ ఐక్యవేదిక ప్రతినిధులు మాట్లాడుతూ.. సెయింట్ మేరీస్ సీఎస్ఐ చర్చి పరిధిలోని ఏడు సంఘాలకు చెందిన క్రైస్తవుల కోసం నగరంలోని కొత్తగూడెం-అల్లీపురం పరిధిలో ఐదెకరాల భూమిని 2018లో రూ.54లక్షలతో సమాధుల తోటగా కొనుగోలు చేశామన్నారు. నేడు ఆ స్థలానికి డిమాండ్ పెరగడంతో కొందరు కబ్జాదారులు అక్రమ రిజిస్ట్రేషన్లతో ఆక్రమణలకు పాల్పడుతున్నారని, వారి నుంచి స్థలానికి రక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రస్తుత సమాధుల ప్రాంగణం పూర్తిగా నిండిపోగా.. భవిష్యత్ అవసరాల దృష్ట్యా ఆ స్థలాన్ని కాపాడాలన్నారు. ఈమేరకు అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సెయింట్ మేరీస్ సీఎస్ఐ చర్చి ప్రెస్బైటర్ చైర్మన్ వి.విశ్వం, గ్రూప్ చైర్మన్ అర్వపల్లి రమేష్, కార్పొరేటర్ పల్లా రోజ్‌లీనా, మాజీ కౌన్సిలర్ దొడ్డా అశోక్, ఐక్యవేదిక ప్రతినిధులు జి.శేఖర్‌బాబు, బి.జోసెఫ్ రామారావు, వీడీఐ జయరాజు, కందుల డేవిడ్, మార్టిన్ జయపాల్, బుడిగ పాల్ తదితరులు పాల్గొన్నారు.



జెడ్పీ సెంటర్‌లో సీఎస్ఐ సంఘాల క్రైస్తవులు

'కేసులు పెట్టే సంస్కృతి కాంగ్రెస్‌లో లేదు'



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ నీరజ

ఖమ్మంఅర్బన్: అభివృద్ధి, కేసులు, ప్రొటోకాల్ పేరుతో తమ తప్పులు కప్పిపుచ్చుకోవడానికే బీఆర్ఎస్ నాయకులు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని, కేసులు పెట్టే సంస్కృతి కాంగ్రెస్‌లో లేదనినగర మేయర్ నీరజ, డిప్యూటీ మేయర్ షేక్ ఫాతిమా జోహర విమర్శించారు. ఆదివారం మంత్రి తుమ్మల క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. డివిజన్లలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో భాగస్వామ్యం అవ్వకూడదని కాంగ్రెస్ కార్యకర్త సాయి కిరణ్‌పై దాడి జరిగిన విషయాన్ని తప్పు పట్టినందుకే బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వంపై దాడులు, కేసులు పెడుతున్నారని ఆరోపించడం తగదని, గతంలో ప్రొటోకాల్‌ను ఎలా పాటించారో ప్రజలందరికీ తెలుసని వ్యాఖ్యానించారు. రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారని వారు పేర్కొన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సారథ్యంలో ఖమ్మంలో జరిగిన అభివృద్ధిపై తాము ఏ సెంటర్‌కు అయినా వస్తామని, జరిగిన అభివృద్ధి చూపిస్తామన్నారు. తప్పు చేసిన వారు శిక్ష అనుభవించాల్సిందే అన్నారు. ఈ సమావేశంలో కార్పొరేటర్ కమర్తపు మురళి, నాయకులు కె.ప్రసన్నకృష్ణ, సాయి కిరణ్, ముక్తార్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న సంఘ సభ్యులు

కామేపల్లి: మండలంలోని కొమ్మినేపల్లి మత్స్య పారిశ్రామిక సహకార సంఘం సభ్యుడు ధరావత్ ముత్తయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆదివారం బాధిత కుటుంబానికి సంఘం సభ్యులు రూ.10 వేలు, డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబు రూ.5 వేలు ఆర్థిక సాయాన్ని అందించారు. మేకల మల్లిఖార్జున్ రావు, నాగేశ్వరరావు, నర్సింహానాయక్, భిక్షం, నాగేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యాన నిరసన ర్యాలీ

ఖమ్మం మామిళ్లగూడెం: బిహార్ ఎన్నికల ర్యాలీలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ప్రధాని నరేంద్ర మోదీ తల్లి హీరాబామోదీపై చేసిన అమానవీయ వ్యాఖ్యలపై ఆదివారం నగరంలో బీజేపీ నాయకులు నిరసన ర్యాలీ చేపట్టారు. జిల్లా బీజేపీ అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు ఆధ్వర్యాన ఖమ్మం ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్ నుంచి ర్యాలీగా బయలుదేరి మయూరిసెంటర్, వైరా రోడ్డు మీదుగా జెడ్పీ సెంటర్ వరకు సాగగా అక్కడఅంబేడ్కర్ విగ్రహం వద్ద రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు మాట్లాడుతూ.. ఈ దేశానికి మోదీ అందించిన నాయకత్వం ప్రపంచమంతా ప్రశంసిస్తుంటే, ఆయన తల్లిని రాహుల్ గాంధీ అవమానించడం సరికాదన్నారు. ఈనేపథ్యాన పోలీసులు రంగప్రవేశం చేసి బీజేపీ నాయకులను అరెస్టు చేసి రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో సన్నే ఉదయ్‌ప్రతాప్, గెంటెల విద్యాసాగర్, సుబ్బారావు, అల్లిక అంజయ్య, గుత్తా వెంకటేశ్వర్లు, మిశ్రా, అరుణ, అనిత, విజయరెడ్డి, మల్లీశ్వరీ, గడీల నరేష్, గుత్తా వంశీ, మేకల నాగేందర్, మహేందర్‌సింగ్, వీరవెల్లి రాజేష్ పాల్గొన్నారు.

ముందస్తు అరెస్ట్..

కామేపల్లి: హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర మోర్చా ఆధ్వర్యంలో తలపెట్టిన నిరసన కార్యక్రమానికి వెళ్లకుండా మండల బీజేపీ నాయకులను ముందస్తుగా ఆదివారం పోలీసులు అరెస్ట్ చేసి కామేపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్టయిన వారిలో బీజేపీ మండలాధ్యక్షుడు జర్పుల రామారావు, పోలూరి రామచంద్రయ్య, కొమ్మినేని భద్రయ్య, బసవయ్య, రమణయ్య తదితరులున్నారు.

సంక్షిప్త సమాచారం..

పేదోడి సొంతింటి కల కాంగ్రెస్‌తోనే సాధ్యం

నేలకొండపల్లి: పేదోటి సొంతింటి కల కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్‌తో కలిసి మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్లను శరవేగంగా పూర్తి చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం ఆర్డినెన్స్ ద్వారా బీసీ బిల్లు తీసుకొచ్చినప్పటికీ బీజేపీ సహకరించడం లేదన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాలకు న్యాయం చేసే విధంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తుందన్నారు. బొందయ్య, జెర్రిపోతుల అంజిని, బచ్చలకూరి నాగరాజు, బోయిన వేణు, యడవల్లి నాగరాజు, కడియాల నరేష్, అనంతు నాగేంద్రబాబు, రాయపూడి రోహిత్, జెర్రిపోతుల సత్యనారాయణ, బోయిన నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో 40 కుటుంబాలు చేరిక



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న దయాకర్‌రెడ్డి

నేలకొండపల్లి: మండలంలోని రాజేశ్వరపురంలో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు సమక్షంలో ఆదివారం కాంగ్రెస్‌లో 40 కుటుంబాల వారు చేరారు. వీరికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంత్రి శ్రీనివాస రెడ్డి చేస్తున్న అభివృద్ధి పట్ల ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారని చెప్పారు. వీరికి పార్టీలో సముచిత స్థానం, గౌరవం ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ తన్నీరు కృష్ణమూర్తి, మాజీ చైర్మన్ శాఖమూరి రమేష్, నాయకులు గోవిందరావు, బచ్చలకూరి నాగరాజు, నర్సయ్య, రామారావు, రమేష్, శ్రీనివాసరావు, పృథ్వి, నరేష్, విజయ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



అధ్యక్షుడు అశోక్‌ను సన్మానిస్తున్న యజమానులు, సంఘం నేతలు

ఖమ్మంఅర్బన్: ఖమ్మం జిల్లా జేసీబీ యజమానుల సంఘం కొత్త కార్యవర్గాన్ని ఆదివారం ఖమ్మంలో గోపాలపురంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన సమావేశంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా భూక్యా అశోక్ ఏకగ్రీవంగా ఎంపికకాగా కార్యదర్శిగా జిల్లా శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా వల్లే శ్రీనివాస్, జాయింట్ కార్యదర్శిగా దర్శనం వెంపటి స్వామి, కోశాధికారిగా నాగండ్ల వంశీ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు అశోక్ మాట్లాడుతూ.. జేసీబీ యజమానుల సమస్యలను సంఘం తరఫున పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ఒక గంట జేసీబీ పనికి రూ.1500, రెండు గంటలపైన ప్రతి గంటకు రూ.1300 వసూలు చేయాలని సమావేశంలో నిర్ణయించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో మలీదు లక్ష్మీనారాయణ, తిరుపతిరావు, వెంకట్రావు, యాదయ్య, వెంకటి, మధు, రాజా, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. కాగా, గతేడాది మున్నేరు వరద సమయాన ప్రకాశ్‌నగర్ వంతెనపై వరదలో చిక్కుకున్న వారిని రక్షించిన జేసీబీ ఓనర్ రమణ, ఆపరేటర్ సుభానిలను ప్రత్యేకంగా సన్మానించి అభినందించారు.

ఆత్మహత్యల నివారణ కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఏసీపీ రమణమూర్తి

ఖమ్మంక్రైం: నగరంలోని ఏసీపీ కార్యాలయంలో ఆత్మహత్యల నివారణ కమిటీ ఆధ్వర్యాన రూపొందిన కరత్రాలను ఏసీపీ రమణమూర్తి ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ గత ఇరవై ఏళ్లుగా ఆత్మహత్యల నివారణకు కృషిచేస్తూ ఇప్పటి వరకు 28 మంది జీవితాలను కాపాడడం అభినందనీయమన్నారు. ఆత్మహత్యలకు పాల్పడటానికి ప్రయత్నించే వారిలో చుట్టపక్కల వారు మానసిక స్థైర్యాన్ని నింపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కమిటీ చైర్మన్ డాక్టర్ పరికిపండ్ల అశోక్, సామాజికవేత్తలు కందగట్ల వెంకన్న, గోపిశెట్టి సత్యానారాయణ, భూక్యా అబ్దుల్‌కలాం పాల్గొన్నారు.

ప్రవక్త బోధనల కరపత్రాలు..

ఖమ్మం మామిళ్లగూడెం: మొహమ్మద్ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వస్సల్లం) బోధనలకు అనుగుణంగా జీవితం సాగించాలని జమాతె ఇస్లామి హింద్ రాష్ట్ర అధ్యక్షుడు మౌలానా మొహమ్మద్ అజాహరుద్దీన్ కోరారు. ఆదివారం జమాతె ఇస్లామి హింద్ ఆధ్వర్యాన సెప్టెంబర్ 1 నుంచి 15 వరకు మొహమ్మద్ ప్రవక్త అందరి కోసం ప్రచార ఉద్యమంలో భాగంగా ఖమ్మంలో దీనికి సంబంధించిన పోస్టర్లు ఆవిష్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎవరైతే దైవానికి భయపడుతూ జీవితం గడుపుతారో వారు ఇహపరలోకాల్లో సాఫల్యం పొందుతారన్నారు. జిల్లా అధ్యక్షుడు జైనుల్ పాషా, ఉపాధ్యక్షులు అబ్దుల్ సమి, ఇంతియాజ్, మొహమ్మద్ యూసుఫ్ షరీఫ్, సౌత్ అధ్యక్షులు సయ్యద్ నిజాముద్దీన్, అబ్దుల్ సుబూర్, మలిక్, అస్మా అన్జుమ్, సమీనా, అస్పియ అన్జుమ్, పాల్గొన్నారు.

హామీల అమలుకు పోస్టుకార్డు ఉద్యమం



మాట్లాడుతున్న కమిటీ చైర్మన్ కృష్ణారావు

ఖమ్మం మామిళ్లగూడెం: తెలంగాణ ఉద్యకారులకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరుతూ రాహుల్ గాంధీకి లేఖ రాశారు. ఆదివారం ఖమ్మం అమరవీరుల స్తూపం వద్ద పోస్ట్‌కార్డ్ ఉద్యమం చేపట్టారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర స్టీరింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ కే.వీ.కృష్ణారావు మాట్లాడుతూ.. ప్రతీ తెలంగాణ ఉద్యమకారుడికి 250 గజాల స్థలం, గృహ నిర్మాణం కోసం రూ.10 లక్షల నగదు, పెన్షన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈమేరకు హామీల అమలు కోసం ఉత్తరాలు రాసి ఖమ్మం పోస్ట్ బాక్స్‌లో వేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా చైర్మన్ పసుపులేటి నాసరయ్య, అర్వపల్లి విద్యాసాగర్, పగడాల నరేందర్, బచ్చల పద్మచారి, షేక్ నాగులు మీరా, సయ్యద్ బురాన్, బాలిని భాస్కర్‌రెడ్డి, భూక్యా శ్రీనివాస్, రాంబాబు, గోపయ్య, దొడ్డ శ్రీనివాస్‌రెడ్డి, అజ్మీరా వీరన్న, యాకూబ్, విజయ్‌కుమార్, వరలక్ష్మి, ధనలక్ష్మి, అనంత లక్ష్మి, స్వరూప, కమలమ్మ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై పట్టింపేది?



ఇటీవల కురిసిన వర్షానికి మర్రిగూడెం పాఠశాలలోకి చేరిన వరద నీరు



నీరు నిలిచి బురదమయంగా మారిన మర్రిగూడెం పాఠశాల, అంగన్‌వాడీ ఆవరణం

- మురికి కూపాలుగా జనావాసాలు
- ఎమ్మెల్యే ఆదేశాలు బేఖాతరు
- పట్టించుకోని కార్యదర్శులు

కామేపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా తయారైంది. ఇటీవల కురిసిన వర్షానికి రోడ్లపై నీరు నిలిచి ఇబ్బంది పడుతున్నా.. కన్నెత్తి చూసే నాథుడే కరువయ్యారు. దీంతో బురదమయంగా రోడ్లు మారి దుర్వాసనతో పాటు రాత్రి సమయాన దోమల బెడద ఎక్కువై విషజ్వరాల బారిన పడుతున్నామని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

స్థానికుల అవస్థలు..

గత నాలుగు రోజుల క్రితమే ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య మండలస్థాయి అధికారులతో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించి పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా చేపట్టాలని, వీధుల వెంట మురుగునీరు లేకుండా చూడాలని, బ్లీచింగ్ చల్లాలని, ఫాగింగ్ చేపట్టాలని సూచించారు. అయినా పట్టించుకోవడం లేదంటే కార్యదర్శుల పని తీరు ఏవిధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. దీంతో మండలంలోని మర్రిగూడెం గ్రామంలో గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు వర్షపు నీరు స్థానిక ప్రాథమిక పాఠశాలతో పాటు పక్కనే ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలోకి చేరి విద్యార్థులు, చిన్నారులు, గర్భిణులు, బాలింతలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కనీసం నీటి తొలగింపు చర్యలు తీసుకోకపోవడం పట్ల స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.